సాక్షి
నంద్యాల
సోమవారం ၊ 5 ၊ జూన్ ၊ 2023



హజ్‌యాత్ర హాయిగా..

ముస్లింలు ఎంతో పవిత్రంగా భావించే హజ్ యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక భరోసా కల్పిస్తోంది. రాష్ట్రం నుంచి మొదటిసారిగా నేరుగా మక్కాకు విమాన సౌకర్యాన్ని కల్పించింది. 8లో▸



అన్నదాన పథకానికి విరాళం

శ్రీశైలంటెంపుల్: భక్తుల సౌకర్యార్థం నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి ఆదివారం కర్నూలుకు చెందిన ఎం.శివశంకర్‌రెడ్డి దంపతులు రూ.1,00,116 విరాళాన్ని అందజేశారు.



ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

శ్రీశైలంటెంపుల్: నిత్యకళావేదికపై కాకినాడకు చెందిన సూర్య నృత్యనికేతన్ వారి సంప్రదాయ నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. పలు భక్తి గీతాలకు నృత్యాలు చేశారు.

న్యూస్‌రీల్

చల్లబడిన వాతావరణం

- 15 మండలాల్లో తేలికపాటి వర్షం

కర్నూలు(అగ్రికల్చర్): వాతావరణం చల్లబడింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని 15 మండలాల్లో ఆదివారం తేలికపాటి వర్షం కురిసింది. ఓర్వకల్లులో 10.4, ఆలూరులో 8.6, హాలహర్విలో 5.2, కర్నూలు రూరల్‌లో 4.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. నంద్యాల జిల్లాలోని 11 మండలాల్లో వర్షాలు కురిశాయి. పగిడ్యాలలో 18.4, అవుకులో 15.2, మిడుతూరులో 8.4, పాణ్యంలో 7, బనగానపల్లెలో 4.6, ఉయ్యాలవాడలో 3.6, నంద్యాలలో 2, గోస్పాడులో 1.8, బండిఆత్మకూరులో 1.6, నందికొట్కూరులో 1.4, గడివేములలో 1 మి.మీ. ప్రకారం వర్షపాతం నమోదైంది. కర్నూలు జిల్లాలో జూన్ సాధారణ వర్షపాతం 77.7 మి.మీ. ఉండగా.. ఇప్పటి వరకు 4.9 మి.మీ. నమోదైంది. నంద్యాల జిల్లాలో జూన్ సాధారణ వర్షపాతం 76.8 మి.మీ. ఉండగా..ఇప్పటి వరకు 3.6 మి.మీ. నమోదైంది. రానున్న రోజుల్లో కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు సమాచారం.

నేటి నుంచి మద్దిలేటయ్య క్షేత్రంలో ఉత్సవాలు



పునర్నిర్మించిన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయం

బేతంచెర్ల: మద్దిలేటి నరసింహస్వామి క్షేత్రంలో సోమవారం నుంచి ఆలయ పునర్నిర్మాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ రామ చంద్రుడు, పాలక మండలి సభ్యులు ఆదివారం తెలిపారు. ఈనెల 5, 6, 7 తేదీలలో ప్రత్యేక పూజలతో పాటు 8వ తేదీ విమానగోపుర, శిఖర కలశ ధ్వజస్తంభ, ద్వార పాలక ప్రతిష్టలు, మహాపూర్ణాహుతి, మహా కుంభాభిషేకం, ప్రాణ ప్రతిష్టాన్యాసములు, బలి ప్రదానం తదితర పూజలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. రూ.3.90 కోట్లతో పనులు పూర్తి చేశామని, ఉత్సవాలకు ఆర్థిక శాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

నేడు స్పందన కార్యక్రమం

నంద్యాల: స్థానిక వైఎస్సార్ సెంటినరీ హాల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి ఫిర్యాదుల స్వీకరించే స్పందన కార్యక్రమానికి జిల్లా అధికారులందరూ హాజరు కావాలన్నారు. జిల్లా కేంద్రంతో పాటు డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయిల్లో కూడా యథాతథంగా స్పందన కార్యక్రమం ఉంటుందన్నారు.

నేడు కూడా పింఛన్ల పంపిణీ..!

కర్నూలు(అగ్రికల్చర్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో జూన్ నెల వైఎస్‌ఆర్ పెన్షన్ కానుక పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. పింఛన్ల పంపిణీ సోమవారం కూడా కొనసాగుతోంది. ఈ నెల 4వ తేదీ సాయంత్రం ఐదు గంటల సమయానికి కర్నూలు జిల్లాలో 2,37,462 పింఛన్లు ఉండగా... 2,32,409 మందికి (97.87 శాతం) పంపిణీ చేశారు. నంద్యాల జిల్లాలో 2,14,939 పింఛన్లు ఉండగా 2,10,846 ఫించన్ల పంపిణీ (98.1 శాతం) పూర్తయింది. వృద్ధాప్య, వికలాంగులు, హెల్త్ పింఛన్లు పొందుతున్న వారిలో 60 ఏళ్ల పైబడిన వారు ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్ పొందే అవకాశం కల్పించారు. ఇతర కేటగిరిలకు చెందిన పింఛన్‌దారులు విధిగా 3 సార్లు వేలిముద్రలు, ఐరిష్ నమోదుకు విధిగా ప్రయత్నం చేయాలి. అప్పుడు కూడా ఫెయిల్ అయితే ఆర్‌బీఐఎస్ ముఖ గుర్తింపు ద్వారా పింఛన్లు పొందే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించింది.

ఎంపీడీఓ కార్యాలయానికి ఫైబర్‌నెట్ కట్

జూపాడుబంగ్లా: స్థానిక ఎంపీడీఓ కార్యాలయానికి నెట్ సరఫరా నిలిపివేయటంతో కంప్యూటర్ల సేవలు నిలిచిపోయాయి. ఎంపీడీఓ కార్యాలయానికి మంజూరయ్యే జనరల్ ఫండ్స్‌లోంచి నెట్, విద్యుత్, పేపర్, బిల్లుల చెల్లింపుతో పాటు కార్యాలయ నిర్వహణ ఖర్చులకు వెచ్చించాల్సి ఉంటుంది. నాలుగు నెలల నుంచి బిల్లుల చెల్లింపు తీర్మానంపై సంతకాలు కాకపోవడంతో అధికారులు చేతి నుంచి బిల్లులను చెల్లిస్తూ వచ్చారు. కాగా అధికారులు చేతులెత్తేయటంతో ఏపీ ఫైబర్ నెట్ కేబుల్ సేవలు నిలిపివేశారు. అలాగే విద్యుత్ బకాయిలు కూడా చెల్లించకపోవటంతో ట్రాన్స్‌కో అధికారులు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు. గత నెలలో జరిగిన సర్వసభ్యసమావేశానికి హాజరైన జెడ్పీ సీఈఓ నారసరెడ్డి విద్యుత్, నెట్, పేపర్, తదితర కార్యాలయ నిర్వహణ బిల్లుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరగకుండా జనరల్ ఫండ్స్ నిధుల్లోంచి వాడుకోవచ్చునని వెల్లడించారు. అయినా జాప్యం జరగడంతో ఫైబర్ నెట్ సేవలు నిలిచిపోయాయి.



గాలివానకు నేలవాలిన వరి పైరును కట్టకడుతున్న దృశ్యం (ఫైల్)

కష్టకాలంలో కర్షకులకు అండ

- 2022–23 రబీలో 7851.25 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- మూడు నెలల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ చెల్లింపు
- 10,434 మంది బాధితులకు రూ. 155.03 లక్షలు విడుదల

అన్నదాతల సంక్షేమమే లక్ష్యంగా వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలుస్తున్న రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ పంటల బీమా (ఇన్‌పుట్ సబ్సిడీ)తో మరింత చేయూతనిస్తోంది. ప్రకృతి వైపరీత్యాలతో చేతికొచ్చే పంటలు దెబ్బతిని దిక్కుతోచని స్థితిలో ఉన్న రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ విడుదల చేసి ఆపన్న హస్తం అందిస్తోంది. పంట నష్టం జరిగిన మూడు నెలల్లోపే పరిహారాన్ని బాధిత రైతు ఖాతాల్లో జమ అయ్యాయి. దీంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఆళ్లగడ్డ: వ్యవసాయంలో లాభాలు పొందాలంటే ప్రకృతి అనుకూలించాలి. లేదంటే నష్టాలు మూటగట్టుకోవాల్సిందే. విత్తు వేసింది మొదలు పంట చేతికొచ్చే వరకు కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నా ఒక్కోసారి అతివృష్టి, అనావృష్టితో పంటంతా నష్టపోవాల్సి వస్తుంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం కొండంత అండగా నిలుస్తోంది. ఉచిత పంటల బీమాతో భరోసా కల్పిస్తోంది. పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీని నేరుగా జమ చేస్తోంది. వైఎస్సార్ ఉచిత పంటల బీమా పథకం కింద 2022–23 రబీ సీజన్ ఈ ఏడాది మార్చిలో అకాల వర్షాలకు జిల్లాలోని 29 మండలాల పరిధిలో 7,851.25 హెక్టార్లలో వ్యవసాయ, ఉద్యాన పంటలకు నష్టం వాటిల్లింది. కాగా దేశంలో ఏ రాష్ట్రంలో ఎప్పుడూ చేయని విధంగా రైతులపై పైసా ఆర్థిక భారం పడకుండా ప్రభుత్వమే పూర్తిగా పంటల బీమా ప్రీమియం సొమ్ము చెల్లించి పంట నష్టపోయిన రైతుల ఖాతాల్లో ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేసింది. జిల్లాలో 10,434 మంది రైతుల ఖాతాల్లో రూ.155.03 లక్షలు జమ చేసింది. జిల్లాలో 7,851 హెక్టార్లలో పంట నష్టం జరగ్గా అత్యధికంగా ఆళ్లగడ్డ నియోజకవర్గంలో 5,319.63 హెక్టార్లలో నష్టం వాటిల్లింది. రుద్రవరం మండలంలో 1,113.67 హెక్టార్లు, చాగలమర్రి 1,264.77 హెక్టార్లు, శిరివెళ్ల 109.34 హెక్టార్లు, ఆళ్లగడ్డ 1,777.91 హెక్టార్లు, దొర్నిపాడు 6.44 హెక్టార్లు, ఉయ్యాలవాడ మండలంలో 1,047.5 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లింది. ఇందుకు గాను 6,617 మంది రైతుల ఖాతాల్లో రూ. 65 లక్షల ఇన్‌పుట్ సబ్సిడీ జమ చేసింది.



నీటమునిగిన మొక్కజొన్న పైరు (ఫైల్)

నియోజకవర్గాల వారీగా పంట నష్ట పరిహారం వివరాలు

నియోజకవర్గం	దెబ్బతిన్న పంటలు (హెక్టార్లలో)	నష్టపోయిన రైతులు	విడుదలైన నష్ట పరిహారం (రూ. లక్షల్లో)
ఆళ్లగడ్డ	5319.63	6,617	65
డోన్	83.59	170	8
బనగానపల్లె	1344.71	1,944	35
నందికొట్కూరు	440.94	758	33
నంద్యాల	146.78	138	19.28
పాణ్యం	120.93	182	4
శ్రీశైలం	394.67	625	10
మొత్తం	7,851.25	10,434	155.03

టీడీపీ ప్రభుత్వంలో అలా..

గతంలో నోటిఫైడ్ పంటలకు అది కూడా ప్రీమియం చెల్లించిన రైతులకు మాత్రమే బీమా వర్తింప చేసేవారు. దీంతో ఆర్థిక స్తోమత, అవగాహన లేని రైతులు బీమా చేయించుకోలేక ప్రకృతి వైపరిత్యాలతో పంట నష్టం జరిగితే ఆర్థికంగా చితికి పోయేవారు. ఒక వేళ సొమ్ములు చెల్లించి బీమా చేసుకున్నప్పటికీ పరిహారం ఎప్పుడొస్తుందో.. ఎంత వస్తుందో? ఎంత మందికి వస్తాయో తెలిసేది కాదు. దీంతో పంటల బీమా అంటేనే ఎవరూ ఆసక్తి చూపేవారు కాదు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఇలా..

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులపై పైసా భారం పడనీయకుండా భారం మొత్తాన్ని ప్రభుత్వం భరిస్తూ ఉచిత పంటల బీమా పథకాన్ని తీసుకు వచ్చారు. దీంతో ఏడాది తిరక్కుండానే కచ్చితంగా పంటల బీమా పరిహారం రైతుల ఖతాల్లో నేరుగా జమచేయడం జరుగుతోంది. తీవ్రంగా నష్టపోయిన రైతులకు కష్టకాలంలో రెండు, మూడు నెలల్లోపే నగదు జమ కావడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పారదర్శకంగా పంట నష్ట వివరాల నమోదు

వర్షం కురిసిన మరుసటి రోజు నుంచే అధికారులు పంట నష్టం అంచనాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. అధికారులు పారదర్శకంగా, మానవతా దృక్పథంతో పంటనష్టాలను అంచనా వేయాలని, పరిహారం బాధిత రైతులందరికీ అందేలా పకడ్బందీగా నివేదిక ఇవ్వాలని సీఎం ఆదేశించడంతో పంట నష్టం వివరాలను అధికారులు పక్కాగా తేల్చారు. గ్రామ స్థాయిలో పంటల వారీగా 33 శాతం కంటే ఎక్కువ నష్టపోయిన రైతుల వివరాలను, పంట నష్టాన్ని నమోదు చేశారు. గ్రామస్థాయిలో రెవెన్యూ, వ్యవసాయ శాఖల సంయుక్త భాగస్వామ్యంతో పంట నష్టం అంచనా నివేదికలు తయారు చేశారు. స్థానిక రైతు భరోసా కేంద్రాల వద్ద సామాజిక తనిఖీ చేపట్టి పంట నష్టం వివరాలు, రైతుల పేర్లు చదివి వినిపించారు. సంబంధిత జాబితా ఆర్బీకేల వద్ద ప్రదర్శించారు. ఏవైనా అభ్యంతరాలుంటే స్వీకరించి పరిశీలించి తుది జాబితా తయారు చేసి నివేదికలు ఉన్నతాధికారులకు అందజేసి అనంతరం పరిహారం మంజూరు చేశారు.

మూడు నెలల్లోనే ఇచ్చారు



నేను రబీ సీజన్‌లో 2.67 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేశా. కోతకు వచ్చిన సమయంలో మార్చి 17న వడగండ్ల వాన పడటంతో పంటంతా నేలకొరిగి నష్టపోయా. ప్రభుత్వం మూడు నెలల్లోనే పంట నష్టం కింద రూ.12,500 అకౌంట్‌లో జమ చేసింది.

– శ్రీనివాసులు, ఆలమూరు, రుద్రవరం మండలం

రూ.15,500 బీమా వచ్చింది



ఐదు ఎకరాల్లో మిరప పంట సాగు చేశా. రెండు రోజుల్లో కోత కోయాల్సి ఉండగా మార్చి 17వ తేదీ రాత్రి వడగండ్ల వానతో పంటంతా దెబ్బతినింది. ప్రభుత్వం వైఎస్సార్ ఉచిత పంటల బీమా కింద రూ. 15,500 ఇచ్చింది. పంట నష్టపోయిన బాధ కాస్త తీరింది.

– కామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, ఇంజేడు, ఉయ్యాలవాడ మండలం

శ్రీశైలానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చారు. వేకువజామున్నే భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి, మల్లన్న దర్శనానికి క్యూలైన్ల వద్దకు చేరుకున్నారు. భక్తుల రద్దీతో ఆలయ ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్లు పూర్తిగా నిండిపోయాయి. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని వేకువజాము నుంచే దర్శనానికి అనుమతించారు. భక్తులకు కంపార్ట్‌మెంట్లలో, క్యూలైన్లలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా దేవస్థాన అధికారులు పర్యవేక్షణ చేపట్టారు. క్యూలైన్లలో వేచి ఉన్న భక్తులకు మంచినీరు, అల్పాహారం, బిస్కెట్లను పంపిణీ చేశారు. ఉచిత దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. భక్తుల రద్దీతో ఆలయ ప్రధాన వీధులు కళకళలాడాయి.



స్వామిఅమ్మవార్ల దర్శనానికి ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచిఉన్న భక్తులు

ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించాలి

- ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి

డోన్ టౌన్: ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది కృషి చేయాలని ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన డోన్ డిపో, బస్టాండ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డిపో నుంచి నడిచే సర్వీసులు, బస్టాండ్‌లో మౌలిక వసతుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. డిపో పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అనంతరం అనంతరం గ్యారేజ్‌ను పరిశీలించి కార్మికులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు పలు సమస్యలను చైర్మన్ దృష్టికి తీసుకెళ్లారు. ఇందుకు స్పందించిన ఆయన వెంటనే తిరుపతి సర్వీసును ఏర్పాటు చేయాలని, నీటి సమస్య పరిష్కారం కోసం ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. డిపోను లాభాల బాటలోకి తెచ్చేందుకు కార్మికులు, అధికారులు కలిసికట్టుగా పని చేయాలని సూచించారు. ఆయన వెంట రీజినల్ మేనేజర్ శ్రీనివాసరావు, డిపో మేనేజర్ శశిభూషణ్, ఎంప్లాయిస్ యూనియన్ డిపో కార్యదర్శి బివీఆర్‌రెడ్డి, ఎస్‌ఎంయూ డిపో అధ్యక్షుడు సీతరామిరెడ్డితో పాటు అధికారులు, సిబ్బంది, కార్మికులు ఉన్నారు.



డిపో అధికారులు, కార్మికులతో మాట్లాడుతున్న ఆర్టీసీ చైర్మన్ మల్లికార్జున

ప్రశాంతంగా ‘జేఈఈ అడ్వాన్స్‌డ్’



పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

కర్నూలు సిటీ: నగరంలోని నందికొట్కూరు రోడ్డులో ఉన్న ఆయాన్ డిజిటల్‌లో జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్షకు 450 మంది విద్యార్థులు హాజరయ్యారు. పేపర్–1, పేపర్–2 రాసిన విద్యార్థుల ఫలితాలను మాత్రమే విడుదల చేయనున్నారు. ప్రిలిమినరీ ఆన్సర్ కీని ఈ నెల 11వ తేదీన విడుదల చేసి, 12వ తేదీన అభ్యంతరాలను స్వీకరించి, 18వ తేదీన ఫలితాలను విడుదల చేయనున్నారు. ర్యాంకులు సాధించిన విద్యార్థులు దేశంలోని ప్రముఖ ఐఐటీల్లో 2023–24 విద్యా సంవత్సరానికి బీటెక్ కోర్సుల్లో ప్రవేశం పొందనున్నారు.

పున్నమి వెన్నెల.. పుడమికి దీవెన

నిండు పున్నమి వేళ సంప్రదాయ పండుగ కనువిందుగా సాగింది. పశు సంపదను అలంకరించి పల్లెజనం పరవశించింది. ఏరువాక సాగి పుడమి పులకించింది. ఆదివారం హొళగుందలో జనసందోహం మధ్య ఎద్దుల ఊరేగింపు దృశ్యమిది. – హొళగుంద



పులి కూనా.. అమ్మను వీడకు!

- నల్లమలలో పులికూన సంరక్షణపై నీలి నీడలు
- తిరుపతి జూకు తరలించిన పులికూనల్లో ఒకటి మృతి
- గతంలో ఇటువంటి సంఘటనే పునరావృతం
- అటవీ శాఖ ఉన్నతాధికారుల్లో చలనం కరువు



ఆత్మకూరురూరల్: పులుల స్వర్గధామమైన భారత దేశంలో వాటి సంరక్షణకు ప్రభుత్వం తీసుకునే చర్యలు ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతి పొందాయి. జాతీయ పులుల సంరక్షణ ప్రాధికారసంస్థ (ఎన్‌టీసీఏ) ప్రాజెక్ట్ టైగర్‌ను ఏర్పాటు చేసి పులుల సమీకృత సంరక్షణకు పాటు పడుతోంది. ఇంతటి మార్గదర్శకాలు ఉన్నప్పటికీ నల్లమలలో మాత్రం తరచూ పులికూనల మరణాలు సంభవిస్తుండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది. తల్లి నుంచి తప్పిపోయిన పులికూనలు అధికారుల సంరక్షణలో చేరిన తర్వాత మరణిస్తుండటం అటవీ శాఖ పర్యవేక్షణ లోపాలను ఎత్తిచూపుతున్నాయి. ఇటీవల ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని పెద్దగుమ్మడాపురం గ్రామ సమీపంలో తల్లిని వీడిన నాలుగు ఆడ పులి కూనలను తిరుపతి జంతు ప్రదర్శన శాలకు చేర్చారు. వీటిని 108 అనే పులికి చెందిన కూనలుగా గుర్తించారు. పులి ప్రవర్తనంలో ఆడపులులే ప్రధాన పాత్ర వహించే సందర్భంలో ఒకే సారి నాలుగు ఆడకూనలు తల్లిని వీడటం జఠిలమైన సమస్యగా మారింది. వీటిని అత్యంత శాస్త్రీయ పద్ధతులలో తల్లికి చేరువ చేయాల్సి ఉండగా అధికారుల వైఫల్యంతో తిరుపతి జంతు ప్రదర్శనశాలకు చేర్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. అక్కడ వీటిని వన్య జీవనానికి దగ్గరగా పెంచుతూ క్రమేపీ అడవిలో వదులుతామని అప్పట్లో అటవీ అధికారులు ప్రకటించారు. అప్పటి వరకు ప్రత్యేక ఎన్‌క్లోజర్లలో ఉంచి పర్యవేక్షిస్తామని చెప్పిన జూ అధికారులు మూడు నెలలుగా వాటిని ఒక ఏసీ గదికే పరిమితం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో తీవ్రమైన ఆందోళనతో ఉన్న పులి కూనలలో ఒకదానికి చిన్నపాటి గాయమైనట్లు విశ్వసనీయంగా తెలిసింది. గాయం ఇన్ఫెక్షన్ అయి అది ఇతర అవయవాలకు విస్తరించడంతో పులికూన మరణించినట్లు సమాచారం. పులికూనలను త్వరలో నల్లమలకు తీసుకు రావాల ని ఇక్కడ అడవిలో ప్రత్యేకమైన ఎన్‌క్లోజర్‌లలో ఉంచాలని, ఆ మేరకు అనువైన అటవీ ప్రాంతాలను అధికారులు గుర్తించే క్రమంలో ఉండగా జూలో పులి కూన మరణించి స్థానిక నల్లమల అధికారులను తీవ్ర నిరాశకు గురిచేసింది. దీంతో మిగిలిన మూడు పులికూనల భవితవ్యంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

గతంలో మత్తు మందు వికటించి..

ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని వెలుగోడు పట్టణం శివార్లలోకి గతంలో రెండు పులికూనలు వచ్చాయి. అప్పట్లో కూడా ఈ కూనలు తల్లి నుంచి విడిపోయి జనారణ్యంలోకి వచ్చాయి. కాకపోతే అవి సంవత్సరం వయసు దాటిన కూనలు. వీటిని నేరుగా పట్టుకోవడానికి వీలు కాదు కాబట్టి వాటికి మత్తు ఇచ్చి బంధించారు. అయితే వాటిలో ఒక పులికూనకు పరిమితికి మించిన మత్తు ఇవ్వడంతో చనిపోయినట్లు అప్పట్లో పేరు చెప్పడానికి ఇష్టపడని ఓ అధికారి తెలిపారు. మిగిలిన రెండో పులికూన జూకు చేర్చారు.

ప్రత్యేక ఎన్‌క్లోజర్ ఏర్పాటు చేయాలి



నల్లమల అడవులలో పులుల సంతతి పెరుగుతున్న క్రమంలో వాటికి ప్రమాదాలు, సమస్యలు తలెత్తడం సహజమే. ముఖ్యంగా పులికూనలు తల్లి నుంచి వీడినప్పుడు వాటిని సంరక్షించి తిరిగి అడవి తల్లి ఒడి చేర్చడానికి మెరుగైన చర్యలు తీసుకోవాలి. ఆదిశగా అటవీ అధికారులు ఆలోచించాలి. పులి సంరక్షణ అంటే యావత్తు పర్యావరణ రక్షణే అనే విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలి.

– జి. సుధాకరరెడ్డి, అడ్వకేట్, ఆత్మకూరు

ఎన్‌ఎస్‌టీఆర్‌లో పరిస్థితి ఇదీ!

- విస్తీర్ణంలోనే అతి పెద్దదైన నాగార్జునసాగర్ – శ్రీశైలం పెద్దపులుల అభయారణ్యంలో ఆంధ్రప్రదేశ్ పరిధిలో సుమారు 70 పెద్దపులులు ఉన్నాయి. ఇవికాక కనీసం 30 దాక పులికూనలు ఉండే అవకాశం ఉంది.
- పులులను, పులికూనలను విపత్కర పరిస్థితుల నుంచి సంరక్షించి వాటిని తిరిగి అడవి తల్లి ఒడిని చేర్చేందుకు అవసరమైన ప్రత్యేక వసతులు లేవు.
- ఎన్‌టీసీఏ మార్గదర్శకాల మేరకు పులుల అభయారణ్యాలకు ముఖ్య అధికారులు అంతా వన్యప్రాణి సంరక్షణలో ప్రత్యేక శిక్షణ పొందిన వారై ఉండాలి. కాగా రాజకీయ ప్రమేయ పోస్టింగ్‌లతో కొందరు అవగాహన లేని అధికారులు ఇక్కడికి బదిలీపై వచ్చినప్పుడు నష్టం వాటిల్లుతుందనే ఆరోపణలు ఉన్నాయి.
- డీఎఫ్ఓ స్థాయి అధికారులు శిక్షణ పొంది ఉన్నా నిర్ణయాధికారం వేరే వారి వద్ద ఉండటం ఇబ్బందులకు కారణమవుతున్నాయి.
- ప్రతి డివిజన్‌కు ఒక ఎనిమల్ రెస్క్యూ వాహనం ఉన్నప్పటికీ వసతులు పెరగాల్సి ఉంది.
- అటవీ ప్రాంత విస్తీర్ణంతో పోలిస్తే అక్కడ పనిచేసే ఉద్యోగుల నిష్పత్తి చాలా తక్కువగా ఉంది.
- ఎన్నో రోజుల నుంచి పెండింగ్‌లో ఉన్న అటవీ రేంజ్‌లు, సెక్షన్ల పునర్విభజన తక్షణం చేపట్టాల్సి ఉంది.
- అటవీ సమీప గ్రామాల ప్రజలతో నిత్య సంబంధాలు కలిగి మనిషికి, వన్యప్రాణికి మధ్య ఉండే ఘర్షణ వాతావరణాన్ని తగ్గించేలా కృషి చేసేలా అధికారులకు శిక్షణ ఇవ్వాలి.

క్లుప్తంగా

పర్యావరణ రక్షణ యువత బాధ్యత


కర్నూలు(హాస్పిటల్): ప్రకృతి విపత్తుల నుంచి రక్షణ పొందేందుకు పర్యావరణాన్ని కాపాడాల్సిన బాధ్యత నేటి యువతపై ఉందని జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి పీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 5న యువతీయువకులు ఐదు కార్యక్రమాలు చేపట్టాలని ఆయన పిలుపునిచ్చారు. ఎలక్ట్రానిక్ వేస్టేజ్‌ను తగ్గించడం, ఇంధనం, విద్యుత్ వినియోగాన్ని తగ్గించడం, అన్ని రకాలైన వ్యర్థాలను తగ్గించడం, నీటి వృథా అరికట్టడం, సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను వ్యతిరేకించడం చేయాలన్నారు. ఈ మేరకు యువతీ యువకులు గూగుల్ ప్లే స్టోర్ నుంచి మేరీ లైఫ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో వివరాలు నమోదు చేయాలని సూచించారు. అంతేగాక http://merilife.orgలో కూడా వివరాలు, ఫొటోలు అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప ర్యావరణ పరిరక్షణ కోసం అన్ని విద్యాసంస్థలు, యువజన సంఘాలు, ప్రభుత్వ ఉద్యోగులు విరివిగా కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

రజక విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు

కర్నూలు(హాస్పిటల్): చదువులో ఉత్తమ ప్రతిభ చాటిన రజక విద్యార్థులకు ఉత్తమ ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేయనున్నట్లు కర్నూలు జిల్లా రజక విద్యాసేవా సమితి జిల్లా అధ్యక్షులు సీపీ. వెంకటేష్ చెప్పారు. ఆదివారం ఈ కార్యక్రమానికి సంబంధించి కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 10వ తరగతిలో 450కి పైగా, ఇంటర్‌లో 850కి పైగా, డిగ్రీలో 80శాతం మార్కులు దాటిన విద్యార్థులకు, ఎంసెట్ మెడిసిన్, ఇంజనీరింగ్‌లో 10వేలలోపు ర్యాంకులు సాధించిన వారికి ప్రతిభా పురస్కారాలు అందజేస్తామన్నారు. అర్హులైన వారు జులై 31వ తేదీలోగా కర్నూలులోని జిల్లా రజక విద్యాసేవా సమితి కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాలకు 9110396511ను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షులు ఎం. గణేష్ పాల్గొన్నారు.

తొగలుగల్లు సమీపంలో చిరుత పులి సంచారం

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామానికి అనుకొని ఉన్న ఓబులేసు స్వామి కొండల్లో చిరుత పులి సంచరిస్తుండడంతో గ్రామస్తులు భయాందోళనలు చెందుతున్నారు. ఆదివారం తెల్లవారుజామున బహిర్భూమికి వెళ్లిన సుదర్శన్ అనే వ్యక్తికి చిరుత పులి కనిపించడంతో కేకలు వేసుకుంటూ ఆయన గ్రామంలోకి పరుగులు తీశాడు. గ్రామస్తులు కట్టెలు తీసుకుని కేకలు వేసుకుంటూ కొండపై వెళ్లి చూడగా అప్పటికే అది పారిపోయింది. మండలంలోని డీ కోటకొండ, ములుగుందం, బిల్లేకల్లు, యాటకల్లు, కలపరి, తొగలుగల్లు కొండల్లో స్థావరం మారుస్తూ చిరుత పులి తిరుగుతోందని, ఫారెస్టు అధికారులు దానిని బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.


చిరుత పులి కనిపించిన కొండ ఇదే..


మంత్రాలయంలో వేడుకను తిలకిస్తున్న ప్రజలు


మద్దికెర మండలం ఎం అగ్రహారంలో ఎద్దుల పార్వేట

ఊరూరా ఏరువాక సంబరం

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఏరువాక సంబరాలు అంగరంగ వైభవంగా సాగాయి. గ్రామాల్లో ఉదయం నుంచే సందడి కనిపించింది. ఎద్దులను ప్రత్యేక రంగులతో అలంకరించి ముస్తాబు చేశారు. ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎద్దులతో ఊరేగింపు నిర్వహించారు. కాడితో పొలాలకు వెళ్లి వ్యవసాయ పనులు ప్రారంభించారు. కొన్ని చోట్ల వందలాది మంది హర్షధ్వానాల మధ్య ఎద్దుల పార్వేట ఘనంగా జరిగింది. వేడుకల్లో యువకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పలు గ్రామాల్లో పరుగు, కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఆదర్శ రైతులను సన్మానించారు.

–సాక్షి ఫొటోగ్రాఫర్/నెట్‌వర్క్


నందవరం మండలం జొహరాపురంలో నదిలో ఎద్దులను శుభ్రం చేస్తున్న అన్నదాతలు


కొసిగిలో పార్వేట దృశ్యం


కల్లూరు మండలం లక్ష్మీపురంలో ఎద్దులను ఏరువాక కోసం సిద్ధం చేస్తున్న అన్నదాత


కౌతాళం మండలం హాల్విలో..


ఎద్దులకు పూజ చేస్తున్న రైతు


పార్వేటకు సిద్ధం..


హొళగుంద మండలం గజ్జహళ్లి ఎద్దుల ఊరేగింపు


సి.బెళగల్‌లో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

టీడీపీ నాయకుల అక్రమాల కిక్కు!

- మద్యం అక్రమంగా తరలిస్తున్న వైనం
- పోలీసులకు పట్టుబడినా మారని తీరు

డోన్: నియోజకవర్గంలో టీడీపీ నాయకులు అక్రమ మద్యం దందాను మానుకోలేక పోతున్నారు. పలు మార్లు జైలుకు వెళ్లివచ్చినా షరా మామూలే అన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్యాపిలికి చెందిన తెలుగు యువత అధికార ప్రతినిధి బోరెడ్డి అభిలాష్ రెడ్డి గతంలో పలు మార్లు అక్రమ మద్యం కేసులో దొరికి పోయాడు. అయినప్పటికీ తన తీరు ఏమాత్రం మార్చుకోకుండా అదే దారిలో నడుస్తున్నాడు. ఏప్రిల్ 16 వ తేదీ అనంతపురం జిల్లా మడకశిరలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు నిర్వహించిన వాహన తనిఖీల్లో ప్యాపిలికి చెందిన తెలుగు యువత అధికార ప్రతినిధి బోరెడ్డి అభిలాష్ రెడ్డి సోదరుడు సాయిప్రసాద్ రెడ్డి, వెంగళాంపల్లి గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త కమ్మర శేఖర్ తదితరులు అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారు. కారులో 35 బాక్సుల ఒరిజినల్ చాయ్స్ డీలక్స్ విస్కీ 3,360 ప్యాకెట్లు ఉన్నట్లు మడకశిర పోలీసులు గుర్తించారు. వాటి విలువ దాదాపు రూ.1.68 లక్షలు ఉండవచ్చని పోలీసులు తెలిపారు. నిందితులను అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచారు. అంతకు ముందు కర్ణాటక రాష్ట్రం బళ్లారిలోనూ అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడటంతో అభిలాష్ రెడ్డికి చెందిన మూడు వాహనాలు బళ్లారి పోలీసులు సీజ్ చేశారు.

తాజాగా వెంగళాంపల్లి వద్ద..

ప్యాపిలి మండలం వెంగళాంపల్లి వద్ద వెంకటేశ్వర్లు అనే వ్యక్తి కల్లందొడ్డిలో నిల్వ ఉంచిన కర్ణాటక మద్యాన్ని సెబ్ పోలీసులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. 96 టెట్రా ప్యాకెట్లు ఉండే ఎనిమిది బాక్సులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్యాపిలికి చెందిన టీడీపీ నాయకుడు బోరెడ్డి అభిలాష్ రెడ్డి కర్ణాటక మద్యాన్ని తనకు విక్రయించినట్లు వెంకటేశ్వర్లు సెబ్ పోలీసులకు తెలిపారు. దీంతో వెంకటేశ్వర్లును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపిన పోలీసులు బోరెడ్డి అభిలాష్ రెడ్డి కోసం గాలిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నారని ఆరోపణలు చేసే టీడీపీ నాయకులు తమ పార్టీలో ఉన్న గురివిందలను మాత్రం వెనకేసుకువస్తున్నారు.

శ్రీ మఠంలో భక్తుల రద్దీ

మంత్రాలయం: వేసవి సెలవులు ముగుస్తున్న నేపథ్యంలో శ్రీ రాఘవేంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సంఖ్య పెరుగుతోంది. ఆదివారం శ్రీ మఠం పరిసరా ప్రాంతాలు, క్యూలైన్లు, ప్రసాదం కౌంటర్‌లు భక్తులతో కిటకిటలాడాయి. పీఠాధిపతి శ్రీ సుభుదేంద్రతీర్థుల ఆశీస్సులతో తెల్లవారుజాము నుంచి మూలబృందావనానికి నిర్మల్య విసర్జన, ఫల, పుష్ప,పంచామృతాభిషేకాలు నిర్వహించారు. రాత్రి ఉత్సవమూర్తి ప్రహ్లాదరాయులను చెక్క, వెండి, బంగారు, నవరత్న రథాలపై ఉంచి శ్రీ మఠం మాడ వీధుల్లో ఊరేగించారు.


శ్రీ మఠం ఎదుట భక్తుల సందడి

సారాయి తాగొచ్చి అమ్మను కొడుతున్నాడు

- తండ్రిపై ఎనిమిదేళ్ల కూతురు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

ఆదోని టౌన్: 'దినాము సారాయి తాగొచ్చి మా అమ్మను కొడుతూ ఏడిపిస్తున్నాడు'' అని తండ్రిపై ఎనిమిదేళ్ల కుమార్తె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. చిన్నారి ఫిర్యాదు మేరకు ఆదోని టూటౌన్ ఎస్‌ఐ విచారణ చేస్తున్నారు. ఎస్‌ఐ చంద్ర తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని చిన్నమార్కెట్ ఏరియాలో నివాసముంటున్న లక్ష్మన్న మద్యానికి బానిసయ్యాడు. రోజూ మద్యం తాగి భార్య జయమ్మను వేధిస్తున్నాడు. జయమ్మ బాధను చూడలేక కుమార్తె సాయికీర్తన ధైర్యంగా ఒంటరిగా ఆదివారం టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. చిన్నారి ఫిర్యాదును స్వీకరించిన ఎస్‌ఐ విచారణ నిమిత్తం సిబ్బందిని లక్ష్మన్న ఇంటికి పంపాడు. ఇంట్లో ఉన్న తల్లి జయమ్మను విచారించారు. తన భర్త మద్యం తాగొచ్చి వేధించడం నిజమేనని పోలీసులకు ఆమె తెలిపారు. లక్ష్మన్న అప్పటికే విషయం తెలుసుకుని ఇంటి నుంచి పరారయ్యాడు. లక్ష్మన్నను అదుపులోకి తీసుకొని కౌన్సెలింగ్ నిర్వహించి, ఇక మీదట ఇలాంటి సంఘటనలు పునరావృత్తం కాకూడదని హెచ్చరిస్తామని ఎస్‌ఐ తెలిపారు. తండ్రి లక్ష్మన్న ఇంటికొచ్చిన వెంటనే తమకు ఫోన్ చేయాలని చిన్నారికి ఫోన్ నంబర్ ఇచ్చి పంపామన్నారు. ఎనిమిదేళ్ల చిన్నారి ధైర్యంగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయడం చిన్న మార్కెట్ ఏరియాలో కలకలం రేపింది.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం


శ్రీనివాసులు (ఫైల్)

రుద్రవరం: చిత్రేనిపల్లె–ఆలమూరు గ్రామాల మధ్య ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. చిత్రేనిపల్లెకు చెందిన శ్రీనివాసులు (52) ఆలమూరు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా.. అదే సమయంలో ముకుందాపురం నుంచి మరో వ్యక్తి బైక్‌పై ఆలమూరుకు వస్తుండగా రెండు బైక్‌లు ప్రమాదవశాత్తూ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన శ్రీనివాసులును 108లో నంద్యాల ఆసుపత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మీదేవి, కుమారు డు ఓబులేసు, కుమార్తె చెన్నమ్మ ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శరత్ కుమార్‌రెడ్డి తెలిపారు.


నేటి నుంచి గోరుకల్లు మరమ్మతులు


కుంగిన గోరుకల్లు కట్ట

పాణ్యం: గోరుకల్లు జలాశయం మరమ్మతులు సోమవారం నుంచి చేపడుతున్నట్లు ఈఈ సుభకుమార్ ఆదివారం తెలిపారు. ఇటీవల రిజర్వాయర్ కట్ట కుంగడంతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఫొటోలతో కూడిన వినతి పత్రాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో మరమ్మతులు చేపడుతున్నట్లు ఈఈ చెప్పారు. మరమ్మతుల్లో భాగంగా రిజర్వాయర్‌లో నీటి నిల్వలను తగ్గించేందుకు ఎస్సార్‌బీసీకి విడుదల చేస్తున్నట్లు చెప్పారు. ఈ విషయాన్ని ఆయకట్టు రైతులు గమనించాలని సూచించారు.

హజ్ యాత్ర హాయిగా..

- జిల్లా నుంచి హజ్‌కు వెళ్తున్న 125 మంది హాజీలు
- ఒక్కొక్కరిపై రూ.80 వేల ఆదనపు భారాన్ని భరించనున్న ప్రభుత్వం
- గతానికి భిన్నంగా ముస్లింల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



గడివేముల: ముస్లింలకు హజ్ యాత్ర ఎంతో అత్యంత పుణ్యప్రదం. పవిత్ర మక్కా నగరానికి తీర్థ యాత్ర చేయడం ఇస్లాంలోని ఐదు (కల్మా, నమాజ్, జకాత్, రోజా, హజ్) మూల స్తంభాల్లో ఐదోవది హజ్. ప్రతి ముస్లిం తన జీవిత కాలంలో కనీసం ఒక్కసారైన హజ్ యాత్ర చేయాలనే భావిస్తారు. ఇస్లామియా క్యాలెండర్‌లోని 1వ నెల 'జుల్–హజ్' (బక్రీద్ నెలలో) నిర్వహిస్తారు. హజ్‌కు వెళ్లిన వారు మదీనాను తప్పక దర్శిస్తారు. వ్యక్తులు తమ ఆర్థిక స్తోమతను బట్టి యాత్ర చేస్తారు. ఈ పవిత్ర యాత్రకు ప్రభుత్వం ఆర్థిక భరోసా అందిస్తోంది. అందుకు అవసరమైన నిధులను ఇప్పటికే విడుదల చేసింది. హాజీల ఖాతాల్లో సైతం జమ చేసింది. ఈ పరిణామాలతో ముస్లింల పక్షపాతి అని మరోసారి సీఎం జగన్ మోహన్‌రెడ్డి నిరూపించుకున్నారు. సీఎం నిర్ణయంపై ముస్లింలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. యాత్రకు ఒక వ్యక్తి వెళ్లి రావాలంటే హైదరాబాద్ నుంచి రూ.3 లక్షలు అవుతోంది. విజయవాడ నుంచి అయితే రూ.3.80 లక్షలు ఖర్చవుతుంది. హైదరాబాద్ విమానాశ్రయం నుంచి వెళ్లే వారి కంటే గన్నవరం నుంచి వెళ్లే యాత్రికులకు ఒక్కొక్కరిపై రూ.80 వేల అదనపు భారం పడుతుంది. ఈ విషయంపై సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేంద్ర విమానయాన మంత్రిత్వ, మైనార్టీ శాఖ మంత్రులకు లేఖలు రాశారు. హైదరాబాద్, బెంగళూరు టిక్కెట్ ధరలతో సమానంగా విజయవాడ ఎంబార్కింగ్ పాయింటుకు ధర నిర్ణయించాలని కోరారు. ఆ శాఖ నిస్పృహాయత వ్యక్తం చేయటంతో సీఎం కీలక నిర్ణయం తీసుకున్నారు. అదనపు భారం రాష్ట్ర సర్కారు భరిస్తుందని భరోసా ఇచ్చారు. అందుకు అనుగుణంగా నిధులు సైతం విడుదల చేశారు.

నంద్యాల హజ్‌సొసైటీ ఆధ్వర్యంలో..

జిల్లా నుంచి హజ్‌యాత్రకు వెళ్లే వారి కోసం ఏటా హజ్‌సొసైటీ అధ్యక్షులు ఇంతియాజ్ అహమ్మద్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏడాది మొత్తం 125 మంది మక్కాకు వెళ్లనున్నారు. వీరికి ఇప్పటికే జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి ప్రభావతి ఆధ్వర్యంలో పలు రకాలు వైద్య పరీక్షలు నిర్వహించి టీకాలు సైతం వేశారు. ముఖ్యంగా విమాన ప్రయాణం సమయంలో బ్రెయిన్ టీబీ రాకుండా మెనింజో కోకో టీకా, పల్స్ పోలియో చుక్కలు, 65 ఏళ్లు దాటిన వారికి ఇన్‌ఫ్లూయెంజా మందులను అందించారు. వీరికి ఇప్పటికే 3 శిక్షణా తరగతుల్ని ఏర్పాటు చేసి, మక్కా పరిసర ప్రాంతాల్లోని పవిత్ర స్థలాల ప్రాముఖ్యాన్ని వివరించారు. దీంతో పాటు అక్కడి వాతావరణ పరిస్థితులు, వసతి సౌకర్యాలపై అవగాహన కల్పించారు.

యాత్ర వివరాలిలా...

జిల్లా నుంచి వెళ్లే యాత్రికులకు ఈ నెల 7,8,9,14,15 తేదీల్లో మక్కా ప్రయాణానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. యాత్రికులు ప్రయాణ తేదీకి 48 గంటల ముందు గుంటూరు–విజయవాడ ప్రధాన రహదారిలోని నంబూరు హజ్ క్యాంపుకు చేరుకోవాలి. అక్కడ నుంచి బస్సు ద్వారా యాత్రికుల్ని నిర్దేశిత సమయానికి బస్సుల్లో విమానాశ్రయానికి చేరుస్తారు.

తొలిసారిగా ఏపీ నుంచే..

ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్‌కు వెళ్లటం చరిత్రలోనే మొదటిసారి. ఇప్పటి వరకు రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు వెళ్లాలంటే హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాల నుంచి వెళ్లాల్సిన పరిస్థితి ఉండేది. వాటికి భిన్నంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేరుగా స్వరాష్ట్రం నుంచే హజ్‌కు పంపేందుకు ప్రోత్సాహం అందించారు. అదనపు భారం కారణంగా ఎవరూ ఇబ్బందులు పడకుండా, సౌకర్యవంతంగా యాత్ర సాగేలా పూర్తి ఏర్పాట్లు చేశారు. దీంతో ముస్లిం సోదరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



గతంలో హజ్‌యాత్ర వ్యయ ప్రయాసలతో కూడుకుని ఉండేది. పక్క రాష్ట్రాలకు వెళ్లి ప్రయాణించాల్సి వచ్చేది. నేడు సీఎం జగన్ మోహన్ రెడ్డి తీసుకున్న నిర్ణయంతో విజయవాడ నుంచే హజ్‌కు వెళ్లేందుకు అవకాశం కలిగింది. ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం.

– ఇంతియాజ్ అహమ్మద్, హజ్ సొసైటీ అధ్యక్షుడు, నంద్యాల

ప్రభుత్వ నిర్ణయం అభినందనీయం



హజ్‌యాత్ర ముస్లింలకు ఎంతో పవిత్రమైనది. అలాంటి యాత్రకు రాష్ట్ర ప్రభుత్వం అదనపు భారం భరించటం అభినందనీయం. యాత్రికులంతా నియమబద్ధంగా నడచుకుని తమ 41 రోజుల యాత్రను పూర్తి చేసుకోవాలి.

– మౌలానా అబ్దుల్ రహమాన్ రషాదీ, కరస్పాండెంట్ మదర్సా– ఏ –అష్రఫుల్ హుదా, గడివేముల

నేడు హజ్ యాత్రికులు గుంటూరు చేరుకోవాలి

కర్నూలు(రాజ్‌విహార్): పవిత్ర హజ్ కోసం మక్కా, మదీనా వెళ్లే యాత్రికుల్లో 7వ తేదీన విమానం ఉన్న వారు సోమవారం సాయంత్రం 5గంటల్లోపు గుంటూరు వద్ద ఉన్న హజ్ క్యాంప్‌కు చేరుకోవాలని రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు హాఫీజ్ మంజూర్ అహ్మద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తమ ఫ్లైట్ తేదీల కంటే రెండు రోజుల ముందే గుంటూరుకు 10 కిలోమీటర్ల దూరంలో హైవే వద్ద ఉన్న నంబూరు జామియా సిరాజుల్ ఉలూం మదరసాలో ఏర్పాటు చేసిన క్యాంప్‌కు తరలిరావాలని కోరారు. అక్కడి నుంచి ప్రక్రియ జరిపి విజయవాడ ఎంబర్కేషన్ (గన్నవరం విమానాశ్రయం) నుంచి విమానాల ద్వారా వెళ్లేందుకు ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు ఫోన్ 94402 32564 నంబరుకు సంప్రదించాలని కోరారు.